'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అహంకారంపై వేటు

లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ ఓటరు ఇచ్చిన తీర్పు చాలా రకాలుగా చరిత్రాత్మకమైంది. 'చార్ సౌ పార్' అంటూ లేని బలాన్ని ఊహించుకొని ఊదరగొట్టిన బీజేపీని ఈ ఎన్నికలు ఖంగుతినిపించాయి. పోయినసారి సాధించుకున్న సొంత మెజారిటీ ఈసారి చేజారిపోయింది. ఎన్డీయే మిత్రపక్షాలతో కలిసి మెజారిటీ మార్కు దాటినా ప్రధాని నరేంద్ర మోదీ అప్రతిహత ప్రస్థానానికి బ్రేక్ పడింది. నేనే సర్వ శక్తిమంతుడిని అంటూ ఆయన చేసిన ప్రచారం ఎదురుతిరిగింది. దైవాంశ సంభూతుడిని అంటూ, ఒక దశలో నేనే దైవాన్ని అంటూ తనకు తాను ఆపాదించుకున్న శక్తులన్నీ ఉత్తవేనని తిరుగులేకుండా తేలిపోయింది. ఇప్పుడు బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీ మాత్రమేనన్నది గుర్తుంచుకోవాలి. ఎన్డీయే మిత్రపక్షాల మీద ఆధారపడక తప్పని పరిస్థితి. ఎన్డీయే కూటమి విజయంలో పరాజయ భావన, ఇండియా కూటమి పరాజయంలో విజయభావన తొంగిచూడటం ఈసారి ఓటరు తీర్పు ప్రత్యేకతగా చెప్పుకోవాలేమో. మోదీ మ్యాజిక్ అనేది పనిచేయలేదని ఓటరు తీర్పు తిరుగులేని విధంగా రుజువుచేసింది. దీంతో తదుపరి ప్రధాని ఎవరనే ఊహాగానాలు వెల్లువెత్తడం, చివరికి ప్రభుత్వం ఎవరు ఏర్పాటు చేస్తారనే దాకా విశ్లేషణలు దూసుకుపోవడం విశేషం.

బీజేపీ గ్యారంటీ కాదు, ఇది నా గ్యారంటీ అంటూ మోదీ ప్రదర్శించిన స్వీయ వ్యామోహం బెడిసికొట్టింది. అంతటా తానై, దిగజారుడు ప్రచారాలు జరిపినా అంతిమ ఫలితం అంత సానుకూలంగా రాలేదన్నది వాస్తవం. మోదీ అహంకారాన్ని ప్రజలు తిరస్కరించారని చెప్పాలి. మర్యాదా పురుషోత్తముడైన రాముడు మోదీ మార్కు అహంకారపూరిత రాజకీయాలకు కలిసి రాకపోవడం గమనార్హం. యూపీ ఫలితాలు ఇందుకు పెద్ద ఉదాహరణ. దేశంలో ఏ ప్రభుత్వం ఉండాలన్నది యూపీ నిర్ణయిస్తుందని అంటారు. అక్కడి ప్రజలు బీజేపీ నుంచి ముఖం తిప్పుకోవడం దేశ రాజకీయాల్లో మామూలు విషయం కాదు. అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోవడం ఓ తార్కాణం. మోదీ తన ఎన్నికల ప్రసంగాల్లో తన పదేండ్ల పాలన గురించి గానీ, గెలిస్తే చేపట్టే కార్యక్రమాల గురించి గానీ ఎక్కువగా మాట్లాడలేదు. విపక్ష ఇండియా కూటమి గురించి, ముఖ్యంగా కాంగ్రెస్ గురించి బెదరగొట్టేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇండియా కూటమి గణనీయమైన స్థానాలు చేజిక్కించుకోవడం దీన్ని సూచిస్తున్నది. ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఎక్కుపెట్టిన అసాధారణమైన విమర్శలు బలాన్ని పెంచలేకపోయాయి. రాజ్యాంగాన్ని మారుస్తారన్న సంకేతాలూ మోదీ టీంను దెబ్బకొట్టాయి. బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్లు పోతాయని ఇండియా కూటమి వెనుకబడిన వర్గాల్లో భయాందోళనలు కల్పించడానికి ఇది అవకాశం కల్పించింది.

ఇండియా కూటమి బలం పెరగడం మోదీకి గానీ, బీజేపీకి గానీ మింగుడుపడే విషయం కాదు. రాహుల్ గాంధీ ఇండియా కూటమిని చాలావరకు బయటపడేయగలిగినా మెజారిటీ మాత్రం అందకుండానే ఉండిపోయింది. ఏదేమైనప్పటికీ జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ తమ కాళ్ల మీద తాము నిలబడగలిగే పరిస్థితి అయితే లేదన్నది వాస్తవం. ఏ ఒక్క పార్టీకి సొంతంగా మెజారిటీ ఇవ్వకుండా ఓటరు ఇచ్చిన తీర్పు మరోసారి సంకీర్ణ ప్రభుత్వాల ప్రాబల్యతను నొక్కిచెప్పింది. సంకీర్ణంలో ప్రాంతీయ పార్టీలు చక్రం తిప్పడం ఎటూ ఉంటుంది. దెబ్బతిన్న సమాఖ్య స్ఫూర్తిని ఇది కొంత మెరుగుపరిచే అవకాశం ఉన్నది. అధికార యంత్రాంగంపై, న్యాయవ్యవస్థపై ఒత్తిడి తగ్గి ఊపిరి పీల్చుకుంటాయని భావించవచ్చు. మొత్తం మీద మోదీ-షా తరహా కక్షపూరిత రాజకీయాలకు ఈ ఎన్నికలు తెరదించినట్టే కనిపిస్తున్నది. భారత ఓటరుకు అభినందనలు.

నిరుత్సాహ పడవలసింది లేదు

లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమి ఇంత తీవ్రస్థాయిలో ఉండటం నిరాశను కలిగించేదే అయినా, కనీసం ఒక స్థాయిలో ముందుగా ఊహించనిదేమీ కాదు. లోక్‌సభ ఎన్నికలు స్థానిక అంశాలకు సంబంధించినవి కావని, బీఆర్ఎస్ ప్రాంతీయ పార్టీ మాత్రమేనని, అందువల్ల దేశాన్ని పాలించగల జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లలో దేనికో ఒకదానికి ఓటు వేయాలన్న ప్రచారం బాగా సాగింది. అది పట్టణ ప్రాంతాల్లోనే గాక గ్రామాల్లో కూడా తగినంత మందిని మెప్పించిన సూచనలు ముందునుంచే కన్పించాయి.

అందుకు అదనంగా ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ, మరొకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలు తెలంగాణలో పలుమార్లు చేసిన ప్రచారాలు ప్రభావం చూపాయి. బీఆర్ఎస్ కేంద్రంలో పాలించగల జాతీయ పార్టీ కాకపోయినా, జాతీయస్థాయిలో కాపాడవలసిన రాష్ట్ర ప్రయోజనాలు అనేకం ఉంటాయని, వాటికోసం గతంలో బీజేపీ, కాంగ్రెస్‌లు చేసింది స్వల్పం అయినందున అటువంటి కృషి కోసం ప్రజలు తమను ఎన్నుకోవాలని నచ్చజెప్పేందుకు బీఆర్ఎస్ నాయకత్వం గట్టి ప్రయత్నమే చేసింది. కానీ ఆ కీలకమైన వాదం ప్రజల మనసుల లోకి సరిగా పోలేదని ఇప్పుడు ఫలితాలను బట్టి స్పష్టమవుతున్నది.

టంకశాల అశోక్

బీఆర్ఎస్ ఏర్పడిన తర్వాత ఆ పార్టీకి లోక్‌సభలో అసలు ప్రాతినిధ్యమన్నదే లేకుండాపోవటం ఇది మొదటిసారి. ప్రాంతీయ పార్టీకి లోక్‌సభ ఎందుకనే వాదనలను ఇతర పార్టీలు లోగడ కూడా ముందుకు తీసుకువచ్చినప్పటికీ ప్రజలు ఆమోదించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు, తర్వాత కూడా పార్టీ అభ్యర్థులను మంచి మెజారిటీతో ఎన్నుకున్నారు. నిజానికి మన ఫెడరల్ వ్యవస్థలో ప్రాంతీయ పార్టీలు పార్లమెంటుకు గెలిచే సంప్రదాయం మొదటినుంచీ ఉంది. ఈ 2024 ఎన్నికలలోనూ తమిళనాడు నుంచి బెంగాల్ వరకు ఇది బలంగా కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏదో ఒక ప్రాంతీయ పార్టీయే గత రెండుసార్లూ గెలుపొందింది. దానిని బట్టి, ప్రజలకు పార్లమెంటు ఎన్నికలంటే జాతీయ పార్టీలకు సంబంధించిన విషయం మాత్రమేనని, ప్రాంతీయ పార్టీలకు వాటితో నిమిత్తం అక్కరలేదనే అభిప్రాయ మేమీ లేదని అర్థమవుతున్నది.

అందువల్ల బీఆర్ఎస్ చేయవలసింది స్వయంగా తన అనుభవాలను, దేశంలోని ఇతర ఫెడరలిస్టు పార్టీల అనుభవాలను విశ్లేషించుకుని, రాగల కాలంలో ప్రజల్లోకి ఆ సందేశాన్ని ఏ విధంగా మరోకమూరు తీసుకువెళ్లగలమనే ఆలోచన చేయటమే. గతం ఎట్లున్నా ఈసారి గల పరిస్థితులను బట్టి విజయావకాశాలు తక్కువన్న అవగాహన పార్టీ నాయకత్వానికి ముందే ఉండినట్లు ఈ నెల 2న జరిగిన పార్టీ కార్యక్రమంలో అధ్యక్షుడు కేసీఆర్ చేసిన ప్రసంగంలో సూచనప్రాయంగా తెలిసింది. కొన్ని సర్వేలు 11 స్థానాలని, కొన్ని ఒకటిరెండని అంటున్నాయని, చివరికి ఏమి జరిగినా విచారించకూడదని, తెలంగాణకు నిజమైన రక్ష బీఆర్ఎస్ మాత్రమే అయినందున మనం మన పని చేసుకుంటూ పోవాలని పార్టీ శ్రేణులకు చెప్పారాయన. అది నిజమే కూడా.

ప్రజలు ఈసారి ఈ విధంగా ఎందుకు ఓటు వేసినా, పార్టీ ఎంపీలు మొదట ప్రత్యేక రాష్ట్ర సాధనకు, తర్వాత రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు ఇతర పార్టీలతో పోలికైనా లేనివిధంగా పార్లమెంటు స్థాయిలో సాగించిన కృషి ఏమిటో ప్రజలకు తెలియనిది కాదు. అది వారికి మునుముందు తిరిగి గుర్తురాకమానదు కూడా. ఎందుకంటే, జాతీయపార్టీలు అనబడేవి ఎప్పుడు కూడా వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల ప్రయోజనాల కోసం కట్టుబడి పనిచేయలేదు, ఇకముందు చేయవు కూడా. వాటికి గల అటువంటి సెంట్రలిస్టు, యూనిటరిస్టు స్వభావం కారణంగానే దేశంలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడి వర్ధిల్లుతున్నాయి. కనుక బీఆర్ఎస్ రోజు మళ్లీ వచ్చి తీరుతుంది.

బీఆర్ఎస్‌కు ప్రస్తుతం లోకసభలో సభ్యత్వం లేకపోవచ్చు గాని రాజ్యసభలో ఉందన్న విషయం మరిచిపోకూడదు. వారు చేయగల కృషిని బట్టి ఒక ప్రాంతీయ పార్టీ పాత్ర ఏమిటో, ఏ పార్టీ నిజ స్వభావమేమిటో ప్రజలకు మునుముందు అవగతమవుతుంది. కనుక ఇందులో పాఠాలు నేర్చుకొనవలసిందే తప్ప కుంగిపోవలసిందేమీ ఉండదు. మరొకస్థాయిలో పార్టీ నాయకత్వం ఇప్పటికే వివరమైన సమీక్షలు జరిపి నిర్ణయాలు తీసుకున్నదానికి అనుగుణంగా గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం జరిపి, శిక్షణా తరగతులు నిర్వహిస్తూ ముందుకుపోయిన పక్షంలో పార్టీలో క్రమంగా ఆత్మవిశ్వాసం పెరిగి, ఈ లోక్‌సభ ఓటమి నష్టాలు మానసికంగా తొలగిపోగలవు. ఆ విధంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావలసి ఉంటుంది. బీఆర్ఎస్‌కు గత 24 ఏండ్లలో జయాపజయాలు, ఇతర ఒడిదుడుకులు కొత్త కాదు. ప్రజలలో గల మౌలిక ఆకాంక్షలు, ఇతర పార్టీలు మరి వేటికీ లేని అవగాహన, స్పష్టత, పట్టుదలతో పార్టీ నాయకత్వం అన్నింటిని అధిగమిస్తూ ఇంతవరకు ప్రయాణించి వచ్చింది. ఆ ప్రయాణం ప్రస్తుత తాత్కాలిక సమస్యను సైతం ఎదుర్కొని ముందుకు సాగగలదనటంలో సందేహం ఉండనక్కరలేదు.

ప్రచారంగా మిగిలిపోయింది. తమకు రాష్ట్రంలో సరికొత్త పోటీదారుగా పలువురు భావిస్తున్న బీజేపీ బలం గతం కన్న రెట్టింపై తమతో సమాన స్థాయికి చేరింది. లోక్‌సభ ఎన్నికలలో మోదీ అఖండ విజయం సాధిస్తారని, అప్పుడు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టగలమని ఇక్కడి బీజేపీ నేతలు చేసిన హెచ్చరికలు, జాతీయస్థాయిలో మోదీ బలహీనపడినందున నెరవేరకపోవచ్చుగాని, అయినప్పటికీ రాష్ట్రస్థాయిలో గణనీయంగా బలపడిన బీజేపీ, ఇక 2029లో రాష్ట్రాధికారం తమదేనంటూ అందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లయితే ఆ ఒత్తిడి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై, రాష్ట్ర కాంగ్రెస్‌పై తప్పక ఉంటుంది.

హామీల అమలులో, సుపరిపాలనలో ప్రభుత్వం విఫలమయ్యే కొద్ది ఒకవైపు బీఆర్ఎస్, మరొకవైపు బీజేపీల నుంచి ఒత్తిడి పెరుగుతూ పోగలదు. ఇందులో గమనించవలసిన మరొక ముఖ్య విషయం, కాంగ్రెస్‌తో పాటు బీజేపీకి కూడా పెద్ద మెజారిటీలు రావటం. మోదీ అనుకూల ఓటుతో పాటు, రేవంత్ పాలన పట్ల ఏర్పడిన నెగెటివ్ ఓటు బీఆర్ఎస్‌కు బదులు ఎక్కువగా బీజేపీకి మళ్లటం అందుకు ఒక కారణం. పోతే, రెండు పార్టీలు కూడా తమ బలమైన అభ్యర్థులను బీఆర్ఎస్ నుంచే తీసుకోవటం తెలిసిందే.

పోతే, బీఆర్ఎస్‌కు సంబంధించి ఈ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత జాగ్రత్తగా సమీక్షించవలసిన ప్రశ్నలు కొన్ని ఉంటాయి. ఒకటి, అభివృద్ధి, సంక్షేమాల నిర్వచనాలు, వాటి సమతులనాలు ఏమిటో తమ ఆలోచనలు తాము చేయటంతో పాటు ప్రజల దృక్కోణాలను కూడా తెలుసుకొని వ్యవహరించటం. చేసిన కృషిని ఆధునిక కమ్యూనికేషన్ల యుగానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు, ప్రజలలోకి నిజమైన వారధిగా మార్చి రెండు వైపుల నుంచి కమ్యూనికేషన్లు సాగిస్తూ, అవసరాన్ని బట్టి సవరణలు చేసుకోవటం, మెరుగులు దిద్దుకోవటం. ఏ చిన్న సామాజిక వర్గాన్ని, ఆర్థికవర్గాన్ని, భౌగోళిక వర్గాన్ని, ఇతర వర్గాలను కూడా విస్మరించక అన్నింటి గురించి అధ్యయనాలు చేస్తూ, వాటిని తమ వెంట తీసుకువెళ్లేందుకు వినయపూర్వకంగా ప్రజాస్వామిక కృషి జరపటం. ఇందులో ఏది కూడా కొత్తగా చెప్పున్నదిగాని, పార్టీ నాయకత్వానికి తెలియనిది గాని కాదు. కావలసింది ఆచరణ. ఎన్నికలతో నిమిత్తం లేని నిరంతర ఆచరణ. ఏ క్లిష్ట స్థితి కూడా పునరుజ్జీవనానికి అతీతమైనది కాదు.

బీఆర్ఎస్‌కు గత 24 ఏండ్లలో జయాపజయాలు, ఇతర ఒడిదుడుకులు కొత్త కాదు. ప్రజలలో గల మౌలిక ఆకాంక్షలు, ఇతర పార్టీలు మరి వేటికీ లేని అవగాహన, స్పష్టత, పట్టుదలతో పార్టీ నాయకత్వం అన్నింటిని అధిగమిస్తూ ఇంతవరకు ప్రయాణించి వచ్చింది. ఆ ప్రయాణం ప్రస్తుత తాత్కాలిక సమస్యను సైతం ఎదుర్కొని ముందుకు సాగగలదనటంలో సందేహం ఉండనక్కరలేదు.

వ్యవస్థపై ప్రజల గెలుపు!

ఈ ఎన్నికలు ఎవరు ప్రధాని అవుతారనే విషయానికి సంబంధించినవి కావు. మన దేశాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి, మన రాజ్యాంగాన్ని ఎలా రక్షించుకోవాలనే విషయాలకు సంబంధించినవి. ఈ ఎన్నికల ద్వారా ప్రజలు వ్యవస్థపై విజయం సాధించారు!

-యోగేంద్ర యాదవ్
రాజకీయ, ఎన్నికల విశ్లేషకుడు

ఇప్పుడు మాట్లాడరేం?

మన ఎగ్జిట్‌పోల్ స్టర్స్, ప్రశాంత్ కిశోర్ ఎక్కడున్నారు? బీజేపీకి 300కు పైగా సీట్లొస్తాయని రెండు రోజులుగా హడావుడి చేసిన గోదీ మీడియా ఇప్పుడు అంతర్ధానమైంది! అదీ వారి విశ్వసనీయత.

-ప్రశాంత్ భూషణ్
ప్రముఖ న్యాయవాది

మేఘం మీద కాలం

కాలం మింగింది మనల్ని
ఏ అరణ్యాల మధ్య భాశీలో వదిలింది
గుర్తుగా ఒక ఈకను ఉంచి వెళ్లింది
గతం తాలూకు లెక్కలన్నీ కట్టాలి
ఇప్పుడు
గడిపిన భారాన్ని తేల్చాలిఇప్పుడు
జ్ఞానసంద్రంలో నీటిమట్టం పెరిగింది
అజ్ఞానపు పలకలు కరిగి
కుప్పలు తెప్పలు పడుతున్నాయి
పక్షుల రెక్కల్లా వలస వచ్చిన మేఘం
ఒకటి
నెత్తిన ఆవరించి చేరింది
విద్యుత్తు తరంగాలు నరాలకు తగిన
ఘాతాన్ని ఇస్తాయా
మార్పు ధ్వనులకు ఉరుములను
చేరవేస్తూ..
ఇది ఒక రసాయన చర్య
చెత్త నుంచి చెరుకు గడలను తీసే
ప్రక్రియ
బంగారుతీగలు అల్లుతూ
ముక్కుతో ఒక ఉష్ణపక్షి తీసుకెళ్తుంది
మోసుకుంటూ సిగ్నల్స్‌ని..
కాలం మళ్లీ విముక్తుని చేసే లోపు
ఎప్పుడు వస్తుంది అసలు?
వస్తుందా వెళ్లిందా అయిపోయిందా..
ఇక మిగలకుండా..!!

రఘు వగ్గు

పేలిపోయిన అంచనాల బుడగలు

లోక్‌సభ 18వ ఎన్నికల్లో కేంద్రంలో పాలక కూటమికి నాయకత్వం వహించే బీజేపీకి 370 సీట్లు వస్తాయని, ఎన్డీయే కూటమికి మొత్తం 543 సీట్లకుగాను 400 దాటిపోతాయని చివరి దశ పోలింగ్ రోజు ఆ పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా చేసిన ప్రకటన మూడు రోజులకే గాలి బుడగలా పేలిపోయింది. 'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అని ఇచ్చిన పిలుపు ఉత్త ఎన్నికల నినాదమేనని మంగళ వారం నాటి ఫలితాలు నిరూపించాయి.

నాంచారయ్య మెరుగుమాల



ప్రధాన ప్రతిపక్షంగా నిలబడే ప్రయత్నం చేసిన 'ఇండియా' కూటమికి నాయకత్వం వహిస్తున్నట్టు కనిపించే మరో జాతీయ, మాజీ పాలకపక్షం భారత జాతీయ కాంగ్రెస్ పెద్ద హడావుడి, అంచనాలు లేకుండా ఎన్నికల ముందు రంగప్రవేశం చేసింది. ఈ కూటమి ఏర్పాటు సమయంలో చేసిన హడావుడి తర్వాత నీరుగారిపోవడం, 'ఇండియా' అలయన్స్ కన్వీనర్ లేదా మరో నామమాత్ర పదవి ఆశించిన జనతాదళ్ యునైటెడ్ నేత, బీహార్ ఎన్డీయే ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తర్వాత బీజేపీతో చేతులు కలపడంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర కూటమి పార్టీల దూకుడు తగ్గిపోయింది. దీంతో 'ఇండీ' కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య పంజాబ్, పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు కుదరలేదు. ఫలితంగా 2024 పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీకి మెజారిటీగాని (272), కనీసం 100 సీట్లుగాని వస్తాయని చెప్పుకునే అవకాశం 81 ఏండ్ల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అత్యంత కీలకమైన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) నాయకురాలు సోనియాగాంధీ, ఆమె సంతానం రాహుల్, ప్రియాంకా గాంధీ వాద్రా, ఇతర సీనియర్ నేతలకు లేకుండాపోయింది. పదేండ్ల కిందట 2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం ఇదివరకటి 206 నుంచి కేవలం 44 సీట్లకు పడిపోయింది. ఐదేండ్లు ఎలాంటి పోరాట పటిమ లేకుండా ప్రతిపక్షంలో కొనసాగిన ఈ జాతీయపక్షం 2019 ఎన్నికల్లో తన బలానికి మరో 8 సీట్లు మాత్రమే జతచేసి స్కోరు 52కు పెంచుకోవడం గొప్ప ఘన విజయంగా మారింది. కేవలం హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే మెజారిటీ సీట్లు గెలుచుకున్న కారణంగా కాంగ్రెస్ తన బలం ఈ ఎన్నికల్లో 70-75 ఎంపీ సీట్లు వస్తే చాలనే సింపుల్ టార్గెట్ పెట్టుకుందని కాంగ్రెస్ లోపలి నేతలే మీడియా మిత్రులకు వెల్లడించారు.

సెంచరీకి దగ్గరవడం కాంగ్రెస్‌కు గొప్ప విజయమా?: కిందటి జాతీయ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన 52 సీట్లలో రెండంకెల స్థానాలు (14) ఒక్క కేరళలోనే వచ్చాయి. ఈసారి కర్ణాటకలోని 28 సీట్లలో సగం, తెలంగాణలో ఏడెనిమిది వస్తాయని ఆశించి తన టార్గెట్ 75 మించదనే అంచనాతోనే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నది. అన్నిటికి మించి దేశంలో అత్యధిక ఎంపీ సీట్లున్న పెద్ద హిందీ రాష్ట్రం యూపీలోని 80 సీట్లలో కేవలం 17 స్థానాల్లోనే తన అభ్యర్థులను నిలబెట్టేలా సమాజ్‌వాదీ పార్టీతో కాంగ్రెస్ పెట్టుకున్న పొత్తు 7 నియోజవర్గాల్లో గెలుపునకు దోహదం చేసింది. నెహ్రూ-గాంధీ కుటుంబానికి జోడు కంచుకోటలుగా చెప్పుకునే రాయ్‌బరేలీ, అమేఠీలో పోటీ చేసే విషయంలో కుటుంబ పెద్ద, సిట్టింగ్ ఎంపీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఆయన చెల్లెలు ప్రియాంకా చివరి నిమిషం వరకూ నిర్ణయం తీసుకోలేకపోవడం విజయావకాశాలపై వారికున్న ఆత్మవిశ్వాసం ఎంతటిదో తేటతెల్లం చేసింది. 2019లో తాను ఓడిపోయిన అమేఠీలో కేంద్రమంత్రి, సినీ నటి స్మృతి ఇరానీతో ఈసారి తలపడటానికి రాహుల్ సాహసించలేదు. చివరికి అనారోగ్యంతో పార్లమెంటుకు పోటీ చేయడానికి తల్లి ఇష్టపడని రాయ్‌బరేలీ నుంచి ఆయన చివరిరోజు నామినేషన్ వేయడం కూడా కాంగ్రెస్ పార్టీకి తన గెలుపుపై ఉన్న అంచనాలేమిటో నిరూపించింది. ఎట్టకేలకు హర్యానాలోని పదింటిలో దాదాపు సగం సీట్లు (10కి 5), రాజస్థాన్‌లో మూడో వంతు స్థానాలు (మొత్తం 25కు 8) ఈసారి కాంగ్రెస్‌కు దక్కాయి. అదీగాక, కేరళలో పూర్వంలాగానే రెండంకెల సీట్లు (20కి 14) రావడం. ఏడాది కిందట అధికారంలోకి వచ్చిన కర్ణాటకలో మూడో వంతు సీట్లు (మొత్తం 29లో 9 సీట్లు) హస్తం పార్టీ ఖాతాలో చేరాయి.

1995 వరకూ కాంగ్రెస్ కంచుకోటగా కొనసాగిన మహారాష్ట్రలోని 48 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ 13 కైవసం చేసుకొని దాన్ని రెండంకెల సీట్లు ఇచ్చిన రాష్ట్రంగా నిలబెట్టుకున్నది. మరో ముఖ్య విషయం ఏమంటే ఆరు నెలల కిందట బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలంగాణలో 8 సీట్లు దక్కడం కూడా కాంగ్రెస్ నిక్కుతూ నీలుగుతూ నూరు సీట్లకు దగ్గరవడానికి కారణమైంది.

'మూసేవాలా పాట వినలేదా?': మార్చి 16న ఎన్నికల తేదీలు ఎన్నికల సంఘం ప్రకటించినప్పటి నుంచి చివరి దశ ఎన్నికల ప్రచారం వరకూ బీజేపీకి ఈ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వస్తాయి? ఎన్ని స్థానాలు రాకపోవచ్చు? అనే విషయాల గురించే పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సోనియా, రాహుల్ తదితర సీనియర్ నేతలు మాట్లాడటం విశేషం. బీజేపీకి ఈసారి 250 సీట్లు కూడా రావని ఒకసారి, 200కు మించవని మల్లికార్జున ఖర్గే చెప్పారు. 7వ దశ పోలింగ్‌కు రెండు రోజుల ముందు కాంగ్రెస్ పార్టీకి 128 సీట్లు వస్తాయని కాంగ్రెస్ అగ్రనేత ప్రకటించి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశారు. యూపీలో కిందటిసారి ఒకే సీటు, అది కూడా రాయ్‌బరేలీ స్థానాన్ని మాత్రమే (సోనియాగాంధీ) గెలుచుకున్న కాంగ్రెస్ బలం ఈసారి 7 సీట్లకు ఎదగడం సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్‌తో పెట్టుకున్న పొత్తు చలవే అని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఆదివారం మీడియా ప్రతినిధులు రాహుల్‌గాంధీని కాంగ్రెస్ పార్టీకి, 'ఇండియా' కూటమికి ఎన్ని సీట్లు వస్తాయో చెప్పాలని కోరగా 'సిద్ధూ మూసేవాలే కా సాంగ్ సునా హై ఆప్నే? (295, సిద్ధూ మూసేవాలా పాట 295 వినలేదా?)' అని వయనాడ్ ఎంపీ జవాబిచ్చారు. అంటే, ఆదివారం వరకూ కాంగ్రెస్ నాయకుల నోట తమకు ఈ పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ సీట్లు వస్తాయనే మాటరానే లేదు.

**అయోధ్యలో రామమందిర నిర్మాణంతో 80కి 80 సీట్లు తన ఖాతాలో వేసుకోవాలన్న బీజేపీ పాచికలు పారలేదు సరికదా వ్యతిరేక ఫలితాలనిచ్చింది. అయోధ్య అంతర్భాగంగా ఉన్న ఫైజాబాద్ స్థానంలోనే బీజేపీ ఓడిపోవడం విశేషం. ఈ అతిపెద్ద రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ 38 సీట్లు కైవసం చేసుకునే దిశగా పయనించడం ప్రధాని నరేంద్ర మోదీ ఆశలు, అంచనాలను తారుమారు చేసింది. అలాగే బీజేపీ 'చార్ సౌ పార్' స్వప్నం సంగతి అలా ఉంచితే, సాధారణ మెజారిటీ మార్కు అయిన 272 సీట్లకు మోదీ-షా ద్వయం అదుపాజ్ఞలలోని పార్టీని దూరం చేయడానికి తన వంతు పాత్ర పోషించిన మరో రాష్ట్రం పశ్చిమ బెంగాల్. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వంలోని టీఎంసీ ఈ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుని 29 సీట్లు గెలుచుకోవడంతో బీజేపీ బలం బంగదేశంలో 18 నుంచి 12 లోక్‌సభ స్థానాలకు పడిపోయింది. పొరుగున ఉన్న మరో తూర్పు రాష్ట్రం ఒడిశాలో 2019లో బీజేపీ 8 ఎంపీ సీట్లను గెలుచుకోగా 2024లో ఈ పార్టీ బలం మొత్తం 21 సీట్లకు గాను అనూహ్యంగా 19కి పెరగడమే గాక తొలిసారి ఆ రాష్ట్రంలో అధికారం దక్కించుకునే స్థాయికి చేరుకున్నది. రాజకీయ, ఎన్నికల విశ్లేషకుడు, స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ ఇటీవల బీజేపీ బలం లోక్‌సభలో 220 సీట్లకు పడిపోయే అవకాశం ఉందని జోస్యం చెప్తూ తన అంచనాలను వివరించారు. అయితే ఇప్పుడు బీజేపీ సొంతంగా 370 లేదా 303 సరికదా కనీసం 272 దక్కించుకోలేని స్థితికి చేరుకున్నప్పటికీ యోగేంద్ర చెప్పినట్టు మరో 220 సీట్లకు దిగజారకుండా బీజేపీని ఒక మేరకు ఒడిశా, తెలంగాణ, స్వల్పస్థాయిలో ఏపీ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో వచ్చిన కొద్దిపాటి సీట్లు కాపాడాయి. ఇంక 16, 17 లోక్‌సభల్లో గుర్తింపు పొందిన ప్రతిపక్ష హోదా కూడా (మొత్తం 543లో పదో వంతు 55) పొందలేకపోయిన మరో జాతీయపక్షం కాంగ్రెస్ పార్టీని 'సెంచరీ'కి దగ్గరకు తీసుకెళ్లిన రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ, రాజస్థాన్, యూపీ, హర్యానా అని చెప్పాలి. మొత్తం మీద రెండు ప్రధాన జాతీయపక్షాలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఎక్కడ ఉంచాలో అక్కడ నిలబెట్టిన భారత ఓటర్లు అభినందనీయులు.